క్లుప్తంగా

అమ్మవారికి గాజులు విరాళం



అమ్మవారికి గాజులు, కంకణాలను అందజేస్తున్న షణ్ముగం, షర్మిళ దంపతులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి భక్తులు 6 వేల డజన్ల గాజులు, 12 వేల కంకణాలను శుక్రవారం విరాళంగా ఇచ్చారు. వాటిని తిరుచానూరుకు చెందిన సివిల్ ఇంజినీర్ షర్మిళ, షణ్ముగం దంపతులు ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శేషగిరికి అందించారు. వరలక్ష్మీ వ్రతానికి వచ్చే భక్తులకు వాటిని పంపిణీ చేయాలని కోరారు.

తిరుపతి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి క్రైమ్: తిరుపతి డీఎస్పీగా జే వెంకటనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. తిరుమల దర్శనార్థం తిరుపతికి చేరుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామన్నారు.

తిరుచానూరు సీఐగా సునీల్ కుమార్



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సీఐగా సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు ఏసీబీలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ముందుగా శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నచోటే భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న గోపీచంద్

తిరుపతి లీగల్ : ప్రస్తుతం కోర్టు భవనాలు ఉన్న స్థలంలోనే కొత్త వాటిని నిర్మించాలని తిరుపతి న్యాయవాదులు కోరారు. వారు శుక్ర వారం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్ మాట్లాడుతూ గతంలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి వికృతమాల సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని హైకోర్టు, ప్రభుత్వం పరిశీలించినట్టు తెలిపారు. ప్రస్తుతమున్న స్థలంలోనే కొత్త వాటిని నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ భూ పరీక్షలు చేశారని, ఆర్అండ్‌బీ అధికారులు కూడా ప్లాన్ అప్రూవల్ చేశారని తెలిపారు. నూతన భవన నిర్మాణాలపై హైకోర్టు చీఫ్ జస్టిస్, సీఎంను కలిసి చర్చించాలని తీర్మానించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు భవాని శంకర్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, ఎస్‌పీ మోహన్, ఎంఎస్ మణి, దినకర్, అప్పిలి ఉమాపతి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

రామచంద్రాపురం: రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు తెలిపారు. స్థానిక మీడియా కేంద్రంలో శుక్రవారం ప్రభాకర్ నాయుడును బీజేపీ నేతలు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జనార్దన్ నాయుడు, శివశంకర్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్, మునెయ్య, చండీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో ట్రైబల్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి

తిరుపతి సిటీ: తిరుపతిలో హథీరామ్ బావాజీ సెంట్రల్ ట్రైబల్ వర్సిటీతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయా లని గిరిజన నవసమాజ వ్యవస్థాపకుడు శివశంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్వీ యూ పరిపాలనా భవనం వద్ద శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్ మోహన్ డేవిడ్ పాల్గొన్నారు.

రేపు వెరికోస్ వెయిన్స్ ఉచిత మెగా వైద్య శిబిరం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని వసుంధర నగర్‌లో ఆదివారం భువనేష్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో మెగా విన్ వాస్క్యులర్ కేర్ వైద్యులు ఆదివారం వెరికోస్ వెయిన్స్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆస్పత్రి వైద్యులు పి.విజయకుమార్, హరీష్ రాజకుమార్, ఈఎస్ఐ ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ కె.బాలశంకరరెడ్డి, భువనేష్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వి.మల్లికార్జున్, రాజగోపాల్‌రెడ్డి, కె.శంకర్‌రాజు, చార్మిల పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు.

యథేచ్ఛగా అక్రమ బిజినెస్

తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రతి రోజూ దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. దీంతో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నిరంతరం రద్దీగా ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు గంజాయి, తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. వారం రోజుల క్రితం తిరుపతి బస్టాండ్‌లోని చెన్నై ప్లాట్‌ఫాం వద్ద పోలీసులు 16 కేజీల గంజాయిని పట్టుకుని ఇద్దరు చెన్నై వాసులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు 500 నక్షత్ర తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారుల్లో చలనం లేదు.


– తిరుపతి అర్బన్

- ఓ వైపు గంజాయి.. మరోవైపు తాబేళ్ల బిజినెస్
- తిరుపతి మీదుగా చెన్నైకి తరలింపు
- బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ

తిరుపతి బస్టాండ్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)



తిరుపతి బస్టాండ్‌లో పట్టుబడిన నక్షత్ర తాబేళ్లు(ఫైల్)



తిరుపతి బస్టాండ్ నుంచి ప్రతి రోజూ వందలాది బస్సులు నడుస్తున్నాయి. వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండ్ నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలోనే దొంగలు విజృంభిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బ్యాగులు, సెల్‌ఫోన్లను లాక్కెళ్లిపోతున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నాయి. బస్టాండ్‌లోని పోలీసులకు సమాచారం ఇచ్చినా ఫలితం ఉండడం లేదని బాధితులు అంటున్నారు. గతంలో బస్టాండ్‌లో 36 సీసీ కెమెరాలు ఉండేవి. వీటి ద్వారా కొంత మేరకైనా దొంగలను గుర్తించేవారు. ఏడాది క్రితం కార్గో పాయింట్‌లో జమ్మలమడుగు నుంచి 40 చేనేత చీరల పార్శిల్ వచ్చింది. దొంగ ఆ పార్శిల్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. సీసీ కెమెరాల సాయంతో పోలీసులు గంటల వ్యవధిలోనే అతన్ని అదుపులోకి తీసుకుని చీరలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. ఒక్కటంటే ఒక్క సీసీ కెమెరా కూడా పనిచేయడం లేదు.

కొరవడుతున్న భద్రతా చర్యలు

బస్టాండ్‌లో సరైన భద్రతా చర్యలు లేకపోవడంతో చోరీలకు నిలయంగా మారింది. బస్టాండ్ పరిధిలో నలుగురు ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, ఏడుగురు పోలీసులు మాత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లె వెలుగు పేరుతో బస్టాండ్లు ఉన్నాయి. 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ప్రతిరోజూ 1.25 లక్షల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు 2 వేలకు పైగా బస్సు సర్వీసులు వచ్చివెళుతున్నాయి. పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ బస్టాండ్‌లో పోలీసు భద్రత నామమాత్రంగా ఉంది. అందువల్లే దొంగలు విజృంభించి చోరీలకు పాల్పడుతున్నారు. దీనికితోడు ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే ఉంది. ప్లాట్‌ఫాంల వద్ద తనిఖీలు చేయడం లేదు. గతంలో సెల్‌ఫోన్లు, బ్యాగ్‌ల చోరీలు మాత్రమే జరిగేవి. తాజాగా గంజాయి, తాబేళ్ల వ్యాపారం మొదలుపెట్టారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉంది.

ప్రత్యేక నిఘా పెడతాం



తిరుపతి బస్టాండ్‌లో ప్రత్యేక నిఘా పెడుతున్నాం. చోరీల నివారణకు చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ పెద్ద ఎత్తున ప్రయాణికులు వచ్చిపోతుంటారు. వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. ఇటీవల గంజాయి, నక్షత్ర తాబేళ్లు పట్టుబడిన విషయం వాస్తవమే. మరింత నిఘా పెంచడానికి ప్రయత్నం చేస్తాం. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదు.

–రామచంద్రనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి

సంప్రదాయాలను కాపాడుకోవాలి

తిరుపతి(అలిపిరి): భారతీయ సనాతన ధర్మాన్ని, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని షీ టీమ్ ఏఎస్ఐ గిరిజ తెలిపారు. భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాస్ మహిళా పొదుపు సంఘాల మహిళలు వరలక్ష్మీ వ్రతం చేశారు. ఇందులో షీ టీమ్ ఏఎస్ఐ గిరిజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు సంప్రదాయాలు, క్రతువులు, నోములు, ఆధ్యాత్మిక క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ శ్రావణ మాసం మొదటి శుక్రవారం లక్ష్మీ దేవిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది మునిరాజ, చంద్రకళ, నాగరాజు, రామానుజులు, సత్యనారాయణ, నాగేశ్వర్, వాణి, భార్గవి, క్లస్టర్ లీడర్లు సుధారాణి, భారతి, నిర్మల, షాహిరాభాను పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో పంచాయతీలు కీలకం

భాకరాపేట: గ్రామీణాభివృద్ధిలో పంచాయతీలే కీలకమని రాష్ట్ర శిక్షణా కార్యక్రమాల అబ్జర్వర్ ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో జరుగుతున్న సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు శిక్షణా తరగతులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీపీడీపీ ప్రణాళికల తయారీలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి(అలిపిరి): పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి రూ.15 వేల కోట్లు అప్పుగానే ఇస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులిస్తే సరిపోదని, నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రాల్లోని గవర్నర్లు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. కేరళలోని వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. బంగ్లాదేశ్‌లో అవినీతి, అహంభావం పెరిగిందని, ప్రజాస్వామ్యాన్ని షేక్ హసీనా చంపేశారని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ప్రజా సంఘాలు అనుసరిస్తున్న తీరు సరైందేనని ఆయన అభిప్రాయపడ్డారు.

కార్పొరేట్లను బహిష్కరిస్తేనే వ్యవసాయానికి రక్షణ

తిరుపతి(అలిపిరి): దేశంలో కార్పొరేట్లను బహిష్కరిస్తేనే వ్యవసాయానికి రక్షణ కలుగుతుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో శుక్రవారం రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులు వ్యవసాయం వదిలేసే పరిస్థితి నెలకొందని, ఆ భూములను చేజిక్కించుకోవాలని కార్పొరేట్ సంస్థలు పన్నాగం పన్నుతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీతోపాటు రుణ విమోచన చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.

భారతీయ సంస్కృతికి వైఖానస ఆగమమే ప్రమాణం



కశ్యప మహర్షి తిరు నక్షత్రోత్సవంలో వేంకటేశ్వర స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమల వేంకటేశ్వర స్వామి ఆరాధనకు శ్రీ వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రమే మూలమని పండితులు తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వైఖానస మహర్షి శిష్యులలో ఒకరైన కశ్యప మహర్షి తిరు నక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఖానస సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక దృక్పథంతో శాస్త్రాధ్యయనం చేయాలన్నారు. విఖనస ట్రస్టు కార్యదర్శి ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ ఆలయ సంస్కృతికి ఆధారమైన ఆగమశాస్త్రాల పరిరక్షణ సమాజం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ అధ్యక్షుడు రాఘవ దీక్షితులు మాట్లాడుతూ విఖనస, భృగు, అత్రి, మరీచి, కశ్యప మహర్షుల జ్ఞాన ఫలాలు సమాజాన్ని ఆలయ వ్యవస్థతో అనుసంధానం చేశాయని చెప్పారు. మానవాళిని మహోన్నత స్థితికి చేర్చే ఆరాధనా విధానం కశ్యప మహర్షి జ్ఞానకాండ గ్రంథంలో వివరించారని తెలిపారు.

డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

తిరుపతి(అలిపిరి): డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆరోపించారు. క్విట్ ఇండియా డేను పురస్కరించుకుని శుక్రవారం లిక్కర్ క్విట్ డ్రగ్స్ అనే నినాదంతో భవాని నగర్ సర్కిల్‌లో మానవ హారం ఏర్పాటుచేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్‌ను కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: పోరాటాలతోనే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సాధ్యమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ తెలిపారు. తిరుపతి న్యూబాలాజీకాలనీలోని మేక్ మై బేబీ జీనియస్ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం వల్ల విద్యా వ్యవస్థ తిరోగమనం దిశగా నడుస్తోందని దుయ్యబట్టారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, టీటీడీ విద్యాసంస్థల్లో సీట్లు పెంచాలని, విద్యార్థినులకు నెలసరి సెలవులు ఇవ్వాలని తీర్మానం చేశారు. అన్ని విద్యాసంస్థల్లో అమ్మాయిలకు ఉచితంగా శానిటరీ పాడ్స్ ఇవ్వాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకుడు వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, ఆఫీస్ బేరర్స్ వినోద్, తేజ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాకారం చేయడమే లక్ష్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ అరవిందకుమార్‌రెడ్డి

తిరుపతి సిటీ: విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్‌లో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కళాశాల అటానమస్ హోదాతో పాటు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు పొందడం ఆనందించదగ్గ విషయమన్నారు. డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ జయచంద్ర, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల చేతిలో దేశ సంపద

తిరుపతి(అలిపిరి): దేశ సంపద కార్పొరేట్ల చేతిలో ఉందని, వారి సంపదలో 10 శాతాన్ని పేదలు, కష్టజీవులకు పంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశ్ డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో శుక్రవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపద, వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించి రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టారని దుయ్యబట్టారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నాయకులు ఎన్ శ్రీరాములు, ఎన్.శివ, మహేంద్ర, శ్రీనివాసులు, గోవింద్ స్వామి, వైఎస్ మణి, నరసింహులు, ఎల్‌కె నాయుడు, కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా, నగర కార్యదర్శి ఎస్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీ సిద్ధేశ్వర తీర్థం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భాగవతారిణి అనసూయ చెంతను మహారాజు కల్యాణం, భీష్మ జననం, అంబా, అంబాలిక స్వయంవరం వంటి ఘట్టాలను ఆలపించారు. శ్రీ సిద్ధేశ్వరతీర్థం మేనేజర్ రాంప్రకాష్ మాట్లాడుతూ మహాభారత ఉత్సవాల ముగింపు వరకు ప్రతిరోజూ అన్నదానం చేస్తామన్నారు.

ఎస్వీయూలో వీసీ తనిఖీలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ వీసీ అప్పారావు శుక్రవారం పలు విభాగాలను తనిఖీ చేశారు. ఎంసీఏ విభాగంలో తరగతి గదులు, కార్యాలయాలను పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరును గమనించి వారి సమస్యలపై ఆరా తీశారు. ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం సేవించి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. పెనుమూరు గొంతివంకకు చెందిన ఆటో డ్రైవర్ పి.గోవర్ధన్, తిరుపతి పూల వీధికి చెందిన ఆటో డ్రైవర్ వి.తిప్పయ్య, తిరుపతి అవిలాలకు చెందిన ఆటో డ్రైవర్ బి రుప్లానాయక్, తిరుపతి న్యూ మారుతీ నగర్‌కు చెందిన ద్విచక్ర వాహన చోదకుడు యు.హరికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

మాజీ సైనికులకు సన్మానం



తిరుపతి రూరల్: జిల్లా క్రీడా సంస్థ, జిల్లా పురావస్తు శాఖ సంయుక్తంగా శుక్రవారం తిరంగ నివాళి కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికులను ఘనంగా సన్మానించాయి. తిరుపతి యూత్ హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు మోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, గోపి, శ్రీలక్ష్మి, చక్రవర్తి, వినోద్ పాల్గొన్నారు. దేశసేవలో సైనికుల సేవలను కొనియాడారు. అంతకుముందు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి బాలాజీ కాలనీ వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులతో తిరంగా ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం ఏపీ ల్యాండ్ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి, గోవా మంత్రి విశ్వజిత్ రానే, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా టీటీడీ అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

ముగిసిన మూలస్థానమ్మ కుంభాభిషేకం

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం అంగరంగా వైభవంగా ముగిసింది. మూడు రోజులు అమ్మవారి కుంభాభిషేక మహోత్సవాలను రిత్వికులు సంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు యాగంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, కుంభాభిషేక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు మొక్కల కుమార్ రాజారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

తిరుపతి అర్బన్: తిరుపతి బైరాగిపట్టెడలోని గిరిజనుల భవనంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తిరుపతి కమిషనర్ నారుపురెడ్డి మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడుతూ ఆదివాసీల కట్టుబాట్లు, భాష, వస్త్ర ధారణ గొప్పగా ఉంటాయని కొనియాడారు. అనంతరం గిరిజన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, సహాయ గిరిజన సంక్షేమ అధికారి బేబీ రాణి పాల్గొన్నారు.

స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలి

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని స్థానికులకు ప్రతి మంగళవారం తిరుమల శ్రీవారి దర్శనం కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం తిరుపతి వాసులదన్నారు. స్థానికుల కోసమే వేంకటేశ్వరస్వామి ఇక్కడికి వచ్చారని పేర్కొన్నారు. స్థానికులకు ప్రతి మంగళవారం దర్శనాలు కల్పించాలని కోరారు. అలాగే వీఐపీల దర్శన వివరాలను బహిర్గతం చేయాలని, కొత్తగా వచ్చిన ఏఈవో చౌదరి బయటకొచ్చి ప్రత్యేక ప్రవేశ దర్శనాల లిస్టును బయటపెట్టాలని కోరారు. దళారులు, దొంగలను వదిలేసి చిన్న చిన్న ఉద్యోగులను, ఆటో, రిక్షా డ్రైవర్లను పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి చిత్తశుద్ధి ఉంటే వీఐపీ దర్శనాల లిస్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మీలో అవినీతి మరక లేకుంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

పన్నుల వసూలుపై దృష్టి పెట్టండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య సిబ్బందిని ఆదేశించారు. ఆమె శుక్రవారం రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ అడ్మిన్, అమెనిటీ, శానిటరీ, వెల్ఫేర్ సెక్రటరీలు, ఆయా విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పన్ను మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పన్నులను డిజిటల్ పద్ధతిలో చెల్లించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. నగరంలోని రోడ్లలో పడిన గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, రాజు, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, కెఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సంగీత సాహిత్య నృత్యోత్సవాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న పిల్లలు

తిరుపతి కల్చరల్ : తిరుపతి మహతి కళాక్షేత్రంలో శుక్రవారం రాయలసీమ రంగస్థలి శ్రీకృష్ణదేవ రాయ జాతీయ సంగీత సాహిత్య నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ రంగస్థలి శ్రీ కృష్ణదేవరాయ జాతీయ స్థాయి సంగీత సాహిత్య నృత్యోత్సవాలు గత 34 ఏళ్లుగా జరుగుతున్నాయని వివరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి వందల మంది కళాకారులు ఇందులో పాల్గొంటున్నారని తెలిపారు. వారికి బసతో పాటు భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం కళాకారులు కెఎస్ రాజా, సుబ్రహ్మణ్యం రెడ్డి, సురేష్ స్వామి, చెంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కొత్తపల్లి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు

చంద్రగిరి : తొండవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యా కమిటీ ఎన్నికలను సర్పంచ్, వైస్ ఎంపీపీలు లేకుండా నిర్వహించారు. దీంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సింగల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. చంద్రమౌళిరెడ్డితో పాటు నాయకులపై దాడికి యత్నించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే టీడీపీ నాయకులు సైతం ఫిర్యాదు చేయడంతో తనతో పాటు మరో ముగ్గురుపై ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేసినట్లు మల్లం చంద్రమౌళిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఏకపక్షంగా పోలీసులు కేసులు నమోదు చేసి, వైఎస్సార్‌సీపీ కేడర్‌ను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా న్యాయ పోరాటం చేస్తామని, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన స్పష్టంచేశారు.

నేడు ఐదు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేత

తిరుపతి రూరల్/చంద్రగిరి : తిరుపతి నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. బాలాజీ కాలనీ, ఎస్వీ యూనివర్సిటీ, ప్రకాశం రోడ్డు, ఇందిరా నగర్, కుమ్మరతోపు, ఎల్ఐసీ రోడ్డు, నెహ్రూనగర్, రిజర్వాయర్‌కాలనీ, పీపీచావడీ, నరసింహతీర్థం రోడ్డు, చింతలకాయల వీధి, పరసలవీధి, బొమ్మగుంట, టౌన్ క్లబ్ రోడ్డు, పట్నూల్ వీధి, చిన్న బజారు వీధి, కొత్తవీధి, గిరిపురం, ఎస్‌డీ రోడ్డు, పూలవీధి, పల్లివీధి, శ్రీనగర్‌కాలనీ, శివజ్యోతినగర్, ఉపాధ్యాయనగర్, క్రాంతినగర్, అలాగే చంద్రగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.